సాక్షి
సంగారెడ్డి
శనివారం। 7 । జూన్ । 2025



కిసాన్ మేళా.. భళా

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయమా ర్కెట్‌లో ఏర్పాటు చేసిన కిసాన్ మేళాకు రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

వివరాలు 10లో ▸



సూపర్ నేపియర్..

పశువులకు మేతగా వేసే నేపియర్ గడ్డి పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

వివరాలు 10లో ▸



నెరవేరని లక్ష్యం

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, కంపోస్టు ఎరువు తయారీకి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు పెడ్లు నిరుపయోగంగా మారాయి.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

రుచి, శుచికరమైన భోజనం పెట్టాలి

జిల్లా బాలికల విద్యాధికారి సుప్రియ



అందోలు కేజీబీవీ పాఠశాలలో మాట్లాడుతున్న సుప్రియ

జోగిపేట(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా ప్రకటించిన మెనూ ప్రకారం రుచి, శుచితో నాణ్యమైన భోజనాన్ని వండి విద్యార్థినులకు అందించాలని జిల్లా బాలికల విద్యాధికారి సుప్రియ సూచించారు. అందోల్ కేజీబీవీ పాఠశాలలో జిల్లాస్థాయి కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం పాఠశాలల్లో వంట చేసేవారికి ఒకరోజు శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తే వారు మానసికంగా ఎదగడంతోపాటు చదువుపై దృష్టిని కేంద్రీకరించే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త మెనూ ప్రవేశపెట్టిందని దాని ప్రకారమే వంటలు తయారు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బండి కృష్ణ, అందోల్, వట్టిపల్లి కేజీబీవీ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లు జ్యోతి, పరమేశ్వరి, లక్ష్మణ్ గౌడ్, డీఆర్‌ఓ రుబీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ




పాఠశాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ రమేశ్ తదితరులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శుక్రవారం మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల వాల్ పోస్టర్‌ను ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ రమేశ్,ఆర్జేడీ విజయ లక్ష్మి, సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ వెంకట నర్సమ్మ ఆవిష్కరించారు. నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో మే మొదటివారంలోనే ముందస్తు బడిబాట నిర్వహించి అడ్మిషన్లు పూర్తి చేసినందుకుగాను ఎంఈఓ శంకర్, హెచ్‌ఎం రామకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ఎంఈఓల శిక్షణ కార్యక్రమంలో జరిగిన బెస్ట్ ప్రాక్టీసెస్ ప్రదర్శనలలో నిజాంపూర్ (కే) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయురాలు సునీత ఉత్తమ ప్రదర్శనకు గాను ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ రమేశ్,ఆర్జేడీ విజయ లక్ష్మి అభినందనలు తెలిపారు.

మాకు న్యాయం చేయండి

ఎంపీ షెట్కార్‌కు బూచినెల్లి రైతులు వినతి



సురేశ్ షెట్కార్‌కు మొక్కను ఇస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: బూచినెల్లిలో బుద్ధవిహార్‌కు సంబంధించిన ఫెన్సింగ్ స్తంభాలు తమ భూముల్లో పాతిపెడుతున్నారని వీటిని అడ్డుకుని తమకు న్యాయం చేయాలని ఆ గ్రామ రైతులు ఎంపీ సురేశ్‌షెట్కార్‌కు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ఎంపీ సురేశ్ షెట్కార్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌ను బూచినెల్లి రైతులు శుక్రవారం కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ షెట్కార్ వెంటనే ఆర్డీఓ రాంరెడ్డికి ఫోన్ చేసి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. ఎంపీని కలసినవారి లో రైతులు విష్ణు, అనంత్‌రాం తదితరులు ఉన్నారు.

అందోలు పెద్ద చెరువులో చేపలు మృతి



జోగిపేట(అందోల్): అందోలు పెద్ద చెరువులో ఎండ వేడిమికి తట్టుకోలేక సుమారుగా 20వేల నుంచి 30వేల వరకు చేపలు చనిపోయాయి. బుధ, గురు వారాల్లో ఉష్ణోగ్రత ఒక్కసారిగా పెరగడంతో చేపలు చనిపోయినట్లుగా మత్స్యకారులు చెబుతున్నారు. ఈ ఏడాది 1.90 లక్షల చేప పిల్లలను చెరువులో వదిలారు. వేల సంఖ్యలో చేపలు చనిపోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. చేపలు చనిపోయి ఒడ్డుకు చేరడంతో మత్స్యకారులంతా చెరువు వద్దకు చేరుకున్నారు. 2,3 కిలోల బరువు వరకు పెరిగిన చేపలు చనిపోయి ఒడ్డుకు చేరాయి. అందోలు పెద్ద చెరువులో చేపలు చనిపోవడం వల్ల సుమారుగా రూ.లక్షకు పైగా నష్టం కలిగిందని మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు నాగరాజు తెలిపారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త



జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

- అంతర పంటల సాగుతో అధిక లాభాలు
- సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన

సాక్షి ఫోన్ ఇన్

సంగారెడ్డి జోన్: పంటలు సాగు చేసే రైతులు నకిలీ విత్తనాలతో మోసపోకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ వెల్లడించారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని వివిధ గ్రామాల రైతులు ఫోన్ చేసి ప్రస్తుత సీజన్‌లో సాగు చేసే పంటలపై ఉన్న సందేహాలను నివృతి చేసుకున్నారు. పంట సాగుకు రైతులు విత్తనాలు గుర్తింపు పొందిన దుకాణాలలో మాత్రమే కొనుగోలు చేసి, రశీదును పొందాలని సూచించారు. ప్యాకెట్‌లలో కాకుండా ఇంటి వద్దే అమ్మడానికి వచ్చే విత్తనాలు కొనుగోలు చేయవద్దని చెప్పారు. విత్తనాలు వేసేందుకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జూలై చివరి వరకు విత్తుకునే అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. పంటలలో నీరు నిలువ కుండా అవసరమైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అధిక మోతాదులో ఎరువులు వినియోగించవద్దని సూచించారు. అన్ని రకాల పంటల సాగుకు అనుకూలమైన భూములు కామారెడ్డితో పాటు మన జిల్లాకు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు బోనస్ కూడా అందిస్తుందన్నారు. నకిలీ విత్తనాల కట్టడికి ప్రత్యేకంగా టాస్క్ ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రశ్న: పత్తి పంట సాగుకు ఏ రకం విత్తనాలు సాగు చేసుకోవచ్చు?

–వినోద్ రెడ్డి, గ్రామం.అందోల్.

జిల్లా వ్యవసాయ అధికారి: పత్తి పంట సాగు కోసం వివిధ రకాల కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. బీజీ –2 రకం విత్తనాలు సాగు చేసుకోవచ్చు. నేల స్వభావాన్ని బట్టి 150 రోజులు, 120 రోజుల లోపు పంట చేతికి వచ్చే విత్తనాలు సాగు చేసుకోవచ్చు.

ప్రశ్న: చెరుకు పంటలో ఎలాంటి ఎరువులు వేసుకోవాలి?

–ప్రయాగ్ కౌవుల, జహీరాబాద్

జిల్లా వ్యవసాయ అధికారి: చెరుకు పంట సాగులో అధిక దిగుబడులు పొందేందుకు డీఏపీ, 15:15:15, 19:19:19, భాస్వరం వేసుకోవచ్చు. యూరియాను దఫాలుగా వేసుకోవాలి. ఆకులు ఊదా రంగులోకి మారితే భాస్వరం, పసుపు రంగులోకి మారితే యూరియాను వినియోగించాలి.

ప్రశ్న: మాది నల్ల రేగడి భూమి. ఎలాంటి పంటలు సాగు చేసుకోవాలి?

–సంగమేశ్వర్, గ్రామం.బర్దిపూర్, మం. ఝరాసంగం

జిల్లా వ్యవసాయ అధికారి: నల్ల రేగడి భూముల్లో అన్ని రకాల పంటలు సాగు చేసుకోవచ్చు. వర్షాలు ఎక్కువగా కురిసిన సమయంలో నీరు నిలవకుండా చూసుకోవాలి. పది అడుగులకు ఒకటి లోతు కాలువలు తీయాలి. నీరు నిల్వ ఉంటే ఏ పంట అయినా నిలబడదు. పత్తితో పాటు కంది సాగు చేసి అంతర పంటగా పెసర, సోయాబీన్ పంటలు సాగు చేసుకోవచ్చు.

ప్రశ్న: వరి పంటలో ఏ రకంను సాగు చేసుకోవాలి?

–మాధవ రెడ్డి గ్రామం. కంసాన్ పల్లి, మం .అందోల్. బైండ్ల అశోక్, గ్రామం. కృష్ణాపూర్, మం.కల్హేర్

జిల్లా వ్యవసాయ అధికారి: వరి పంటలో సన్న రకం ధాన్యం సాగు చేసుకోవచ్చు. ప్రభుత్వం సన్న రకానికి బోనస్ కూడా అందిస్తుంది. తక్కువ సమయంలో కే.ఎన్.ఎం 1638 రకం ధాన్యం మేలైనది. 125 రోజులలో ఒక ఎకరానికి 28 నుంచి 32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అంతేకాకుండా ఈగ అగ్గి తెగుళ్ల నుంచి తట్టుకునే శక్తి ఉంటుంది.

ప్రశ్న: ప్రస్తుతం వర్షాలు కురవడం లేదు. పత్తి విత్తనాలు విత్తుకోవచ్చా?

–అబ్దుల్ అజీం, గ్రామం, మం. పెద్దాపూర్, మం. సంగారెడ్డి

జిల్లా వ్యవసాయ అధికారి: గత నెలలో 20 మిల్లీమీటర్ల వర్ష పాతానికి గాను 140మిల్లి మీటర్ల వర్ష పాతం నమోదయ్యింది. భూమిలో అదను రావడంతో ఎలాంటి సమస్య లేదు. జూలై చివరి వరకు కూడా పత్తి విత్తనంతో పాటు అన్ని రకాల పంటలు సాగు చేసుకోవచ్చు.

ప్రశ్న: పత్తి పంటలో అంతర్ పంటలు సాగు చేసుకోవచ్చా? ఏ రకం పంటలు సాగు చేసుకోవచ్చు?

–వినోద్ సింగ్, గ్రా.మం.ఝరాసంగం, మల్లికార్జున్, గ్రా. హద్నూర్ మం.న్యాల్‌కల్.

జిల్లా వ్యవసాయ అధికారి: నల్ల రేగడి భూములలో పత్తి పంటలో అంతర పంటలను సాగు చేసుకోవచ్చు. కంది, పెసర, సోయాబీన్ పంటలు సాగు చేసుకోవచ్చు. నాలుగు నుంచి ఆరు వరుసలలో అంతర పంటలు వేయొచ్చు. దీంతో కర్బన శాతం పెరుగుతుంది. సస్యరక్షణ చర్యల్లో భాగంగా నల్ల భూములలో నీళ్ల ఎక్కువగా నిలువ ఉండే అవకాశం ఉంటుంది. లోతు కాలువలు తీసి వాటిని మళ్లించాలి.

ప్రశ్న: గత నెలలో కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు వేశాను. ప్రస్తుత ఎండలకు మొక్కలు వాడిపోతున్నాయి. ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

–ప్రతాప్, గ్రా. జగన్నాథ్ పూర్, మం.నారాయణఖేడ్

జిల్లా వ్యవసాయ అధికారి: ఈ సంవత్సరం రుతుపవనాలు ముందుగానే వచ్చాయి. గత నెలలో కురువాల్సిన వర్షం కంటే ఎక్కువగా నమోదయింది. ఎక్కువగా మొక్కలు వాడిపోయే దశలో ఉంటే 15 లీటర్ల నీటిలో 15 గ్రాముల యూరియా కలిపి మొక్కల వరుసలో స్ప్రే చేయాలి. ఎక్కువ మోతాదులో స్ప్రే చేస్తే ఆకులు మాడిపోయే ప్రమాదం ఉంటుంది.

ప్రశ్న: పొడి మట్టిలో విత్తనాలు వేసుకోవచ్చా?

–జనార్దన్ రెడ్డి, గ్రామం. ముంగి, మం. న్యాల్ కల్

జిల్లా వ్యవసాయ అధికారి: పొడి మట్టిలో విత్తనాలు నాటవద్దు. అడుగున్నర లోతులో తడి ఉంటే మాత్రం విత్తనాలు విత్తుకోవచ్చు. నల్ల రేగడి భూములలో పత్తి పంటను సాగు చేసుకోవచ్చు. అంతర పంటగా కంది, పెసర, సోయా వేసుకోవచ్చు.

ప్రశ్న: ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా ఉన్నాయి అంటున్నారు. ఏ పంట వేసుకోవడం మంచిది?

–రాజా ప్రసాద్, గ్రామం. చాల్కి, మం.న్యాల్‌కల్.

జిల్లా వ్యవసాయ అధికారి: ప్రస్తుతం కురవాల్సిన వర్షానికంటే ఎక్కువ వర్షపాతం నమోదయింది. పత్తిలో అయితే 145 రోజులకు వచ్చే విత్తనాలను సాగు చేసుకోవాలి. ఎక్కువగా వర్షం కురిస్తే మొక్కల మధ్య నీరు నిలిచి వేళ్ళు కుళ్లిపోతాయి. లోతు కాలువలు తీసి నీటిని మళ్లించాలి.



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- కెమెరాల ఏర్పాటుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి
- పిరమిల్ కంపెనీ సహకారంతో టౌన్‌లో 93 కెమెరాల ఏర్పాటు
- ప్రారంభించిన జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్



జహీరాబాద్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

జహీరాబాద్ టౌన్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. దిగ్వాల్‌లో గల పిరమిల్ కంపెనీ సహకారంతో జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన 93 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా కంట్రోల్ రూంలో ఎస్పీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..జహీరాబాద్ పట్టణాన్ని పూర్తి నిఘా నీడలోకి తెచ్చి, నేర రహిత పట్టణంగా మార్చడమే లక్ష్యమన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, టౌన్‌లోకి ఎంట్రీ, ఎగ్జిట్‌లలో ఏర్పాటు చేశామన్నారు. జహీరాబాద్ జిల్లా రాష్ట్ర సరిహద్దు కావడంతో వివిధ రకాల ఆస్తి సంబంధిత నేరాలు, రేషన్ బియ్యం, గంజాయి, గుట్కా అక్రమ రవాణాకు అవకాశం ఉందని, సీసీ కెమెరాల ఆధారంగా వీటికి అడ్డుకట్ట వేయడానికి, నేరపరిశోధనకు కీలకంగా మారతాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, ర్యాష్ డ్రైవింగ్ అనుమానిత వాహనాలను గుర్తించేందుకు కెమెరాల ప్రాధాన్యత కీలకమని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలో 93 కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన డీఎస్పీ సైదా నాయక్, టౌన్ సీఐ శివలింగం, ఎస్ఐ.కాశీనాథ్ ముందుకు వచ్చిన పిరమిల్ కెంపెనీ యాజమాన్యాన్ని ఎస్పీ పంకజ్ అభినందించారు. సీసీ కెమెరాలను శ్రీగణేష్ టెక్నలాజీ నిర్వహకులు ఇన్‌స్టాలేషన్ చేశారు.

విద్యతోనే విలువ


జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



బడిబాట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ

పటాన్‌చెరు టౌన్: విద్యతోనే సమాజంలో విలువ వస్తుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. 'బడిబాట'కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు పాఠశాలలో ఆరేళ్లగా జరుగుతున్న అభివృద్ధి, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..స్కూల్ అప్ గ్రేడేషన్ కోసం ప్రతిపాదనలు పంపితే వెంటనే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు. ఎక్కువ సంఖ్యలో విద్యార్థుల నమోదు నేపథ్యంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఉపాధ్యాయులను పంపిస్తామని అన్నారు. బడి ఈడు పిల్లలను తప్పక బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం 'బడిబాట'కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ వెంకటేశం, మండల విద్యాధికారి నాగేశ్వర్ నాయక్, ఏఏపీసీ చైర్మన్ బండి శాంతి, మాజీ చైర్మన్ పురుషోత్తం , మాజీ సర్పంచ్ బండి శంకర్, మాజీ ఉప సర్పంచ్ శివకుమార్, మాజీవార్డుసభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న గురుకుల కళాశాలలో ప్రవేశాలు



జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హిమబిందు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌కు సంబంధించి 15 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్టీ విద్యార్థులు పదవ తరగతి సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, టీసీ,కుల ధృవీకరణ పత్రాలను తీసుకుని కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు



పెద్దాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నిర్మలారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ణానికి ఆమె శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.5లక్షల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. అదేవిధంగా మండలంలోని సూరారం,మెలగిరిపేట్,కోనాపూర్, రేజింతల్, నిజాంపూర్, కొల్కూర్,ఆత్మకూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న పార్టీ నాయకులతో కలిసి నిర్మలారెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్ గౌడ్,నాయకులు ముగ్దుమ్ పటేల్, శివకుమార్ పాల్గొన్నారు.

ఆ వ్యాపారులకు జోగిపేటలో అనుమతివ్వకండి

ఇతర రాష్ట్రాల వారిపై మంత్రి, కమిషనర్‌కు మోచీ సంఘం వినతి



మంత్రి దామోదరను కలిసిన మోచీ సంఘం నాయకులు

జోగిపేట(అందోల్): ఇతర రాష్ట్రాలకు చెందిన వారు జోగిపేటలో ఫుట్‌వేర్ షాపులను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిని ఇవ్వకూడదని కోరుతూ జోగిపేట మోచీ సంఘం నాయకులు మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం సమర్పించారు. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు స్థానికంగా 80 వరకు కుటుంబాలున్నాయని వారు సూచించగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జోగిపేట మోచీ సంఘం అధ్యక్షుడు కమలశెట్టి నాగేష్, ప్రధాన కార్యదర్శి ఆబేద్‌లు తెలిపారు. ఇటీవల జరిగిన నూతన కార్యవర్గ సమావేశంలో ఈ విషయమై ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆ కాపీని మంత్రి దామోదరకు, మున్సిపల్ కమిషనర్ తిరుపతికి అందజేసినట్లు తెలిపారు. మంత్రి, కమిషనర్‌లను కలిసిన వారిలో మోచీ సంఘం నాయకులు భాస్కర్, ప్రశాంత్, తోడేటి నరేందర్, ఎండీ ఆబేద్, అనిల్, పరమేశ్వర్‌లు ఉన్నారు.

రైతు ముంగిటకే శాస్త్రవేత్తలు

శాస్త్రీయ పరిజ్ఞానం అందించేందుకు అధిక ప్రాధాన్యం

- వచ్చే నెలలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తాం
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- హుస్నాబాద్‌లో కిసాన్ మేళా ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

హుస్నాబాద్: వ్యవసాయ పద్ధతులు, దిగుబడిని పెంచేలా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించేందుకు రైతు ముంగిటకే శాస్త్రవేత్తలను పంపుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కిసాన్ మేళాను శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. అంతక ముందు మార్కెట్ యార్డు ప్రధాన ద్వారం నుంచి మంత్రులు ఎండ్ల బండిపై సభా వేదిక వద్దకు వచ్చారు. పలు స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రైతులు ఆదాయం పెంచుకోవాలంటే మానవాళికి అవసరమైన పంటలు పండించడంతోపాటు వివిధ దేశాలకు ఉత్పత్తులను అందించే స్థాయికి చేరుకోవాలన్నారు. రసాయన ఎరువులతో పంటలు పండించడం వల్ల బయటి దేశాల్లో మన ఉత్పత్తులను తీసుకోవడం లేదన్నారు. సేంద్రియ ఎరువులతోనే పంటలు పండించేందుకు రైతులు మొగ్గుచూపాలన్నారు. అభ్యుదయ రైతుల సూచనలు, సలహాలు పంచుకోవాలన్నారు. మన భూముల్లో ఏ పంటలు పండుతాయో తెలుసుకోవాలన్నారు.

సాంప్రదాయ పంటలే మేలు

మారుతున్న కాలానికి అనుగుణంగా వాణిజ్య పంటలు, సాంప్రదాయ పంటలు వేసి లాభాలు గడించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. హుస్నాబాద్ ఎత్తయిన ప్రాంతమని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టును ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కాలువలు వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు శాస్త్రవేత్తలు చైతన్యపరుస్తున్నారని తెలిపారు.

సోలార్ పంపు సెట్లు పంపిణీ చేయాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



జేఎన్‌టీయూలో అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్/సంగారెడ్డి టౌన్/సంగారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర గిరి వికాసం పథకం ద్వారా పోడు పట్టా భూములు పొందిన రైతులకు సోలార్ పంపుసెట్లు పంపిణీ చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం ఇందిరా సౌర గిరి వికాసం పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు దివ్యాంగుల ప్రజావాణిలో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని శాంతినగర్ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి బియ్యం నాణ్యతతో పాటు సరఫరా చేసే ప్రక్రియను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం జిల్లాకు నూతనంగా మంజూరైన నవోదయ విద్యాలయానికి సుల్తాన్ పూర్, జేఎన్టీయూలో ఈ విద్యా సంవత్సరానికి తాత్కాలిక ఏర్పాటుకు భవనాన్ని విద్యాశాఖ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...జిల్లాలో 2024–25 ఏడాదికి గాను 73 మంది రైతులను గుర్తించి రెండున్నర ఎకరాల భూమిని ఒక గ్రూప్ చేయాలన్నారు. అందులోని రైతులకు ఒక యూనిట్ రూ.6 లక్షలతో మోటార్స్,సోలార్ పంపు సెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పేదలకు వరంలాంటిదని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. దివ్యాంగుల సమస్యల పరిష్కరించి వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక రీచులు లేనందున టీజీఎమ్‌డీసీ ద్వారా అవసరమైన చోట్ల ఇసుక బజార్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు అవసరమైన ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో నవోదయ విద్యాలయ ప్రారంభోత్సవానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. జిల్లా విద్యార్థులకు విద్య మరింత చేరువవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, గిరిజన సంక్షేమ అధికారి అఖిలేశ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

సంగారెడ్డి క్రైమ్: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలికి గాయాలయ్యాయి. సీఐ రమేష్ వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజంపేటకు చెందిన మంగలి కిష్టమ్మ (70) స్థానిక నటరాజ్ థియేటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో పని నిమిత్తం కొత్త బస్టాండ్ ఆవరణలో రోడ్డు దాటుతుండగా, సంగారెడ్డి నుంచి పోతిరెడ్డిపల్లి వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో వృద్ధురాలి కాలు విరిగిందని వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం పట్టణంలోని మంజీరా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విలేకరులకు దేహశుద్ధి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొత్తపేట చౌరస్తా వద్ద గురువారం అర్ధరాత్రి ఇటుక బట్టీల వద్దకు వెళ్లి పలువురు విలేకరులు హల్‌చల్ చేశారు. దీంతో వారికి దేహశుద్ధి చేశారు. నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ నుంచి గురువారం రాత్రి కొత్తపేట, రూప్లా తండాల్లో ఉన్న ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తున్నారు. శివ్వంపేటకు చెందిన నలుగురు విలేకరులు అర్ధరాత్రి కొత్తపేట చౌరస్తా వద్ద మట్టి తరలిస్తున్న పలు ట్రాక్టర్లను అడ్డుకొని డబ్బులు డిమాండ్ చేశారు. ఇటుక బట్టీల నిర్వాహకులతో వాగ్వాదానికి దిగడంతో వారికి దేహశుద్ధి చేశారు. డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు వచ్చి గొడవను అదుపు చేశారు. ఆ విలేకరులపై బట్టీల నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం కొందరు పెద్దలు కేసు నమోదు కాకుండా ఇరువర్గాలతో మాట్లాడారు. మండలంలో కొందరు మీడియా ముసుగులో అరాచకాలు చేస్తుండటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిది పశువుల పట్టివేత



నర్సాపూర్ : రోడ్డుపై వెళ్తున్న ఐదు ఆవులు, మూడు ఎడ్లను పట్టుకున్నామని స్థానిక ఎస్‌ఐ లింగం తెలిపారు. బక్రీద్ నేపథ్యంలో స్థానిక చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం విధులు నిర్వహిస్తుండగా సంగారెడ్డి వైపు నుంచి పశువులు వచ్చాయని, తూప్రాన్ వైపు వెళ్లగా కొంతదూరం వెంబడించినట్లు చెప్పారు. వాటి వెంట ఎవరూ లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నామని, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని కాసాల గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జవాన్‌పై దాడి చేసిన వ్యక్తి రిమాండ్



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: ఆర్మీ జవాన్‌పై భౌతికదాడి చేసి బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. కొండపాక మండలం మర్పడ్గ గ్రామానికి చెందిన నేతి శ్రీకాంత్ అతడి స్నేహితుడు బాబుతో కలిసి గత నెల 27న రాత్రి 7.30 గంటల సమయంలో గ్రామంలోని ఓ కిరాణా షాపు వద్ద కూల్ డ్రింక్ తాగుతున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన పిండి శ్రీశైలం అక్కడికి వచ్చి శ్రీకాంత్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఆర్మీ ఉద్యోగాన్ని కించపరుస్తూ భౌతికదాడికి దిగాడు. దీంతో శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారు. నిందితుడు శ్రీశైలంపై వన్‌టౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లలో భౌతిక దాడి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ మల్లేశంగౌడ్, సిబ్బంది ఉన్నారు.



మేళాలో స్టాల్స్‌ను సందర్శిస్తున్న రైతులు



కూరగాయల స్టాల్‌లో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

కిసాన్ మేళా.. భళా

తరలివచ్చిన ఉమ్మడి జిల్లా రైతులు

- ఆధునిక వ్యవసాయ పరికరాల గూర్చి ఆరా
- పంట మార్పిడి, సేంద్రియ సాగుపై అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు
- హుస్నాబాద్‌లో అన్నదాతలతో కిటకిటలాడిన స్టాల్స్

మండల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కిసాన్ మేళాకు విశేష స్పందన లభించింది. వ్యవసాయానికి సంబంధించి 135 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. రైతులు స్టాల్స్‌ను సందర్శించి పరికరాల పని తీరు, ఏ నేలల్లో ఏ విత్తనాలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయో అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గం నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. వ్యవసాయ పద్ధతులు, దిగుబడి, ఆదాయ వనరులపై శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు రైతులకు అవగాహన కల్పించారు.

హుస్నాబాద్

హల్‌చల్ చేసిన ఆవు

హుస్నాబాద్: మేళాలో ఆవు హల్‌చల్ చేసింది. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్‌లను ఎండ్ల బండ్లపై వేదిక వద్దకు తీసుకొచ్చేందుకు నాలుగు ఎండ్ల బండ్లను సిద్ధం చేశారు. మంత్రులు ఎండ్ల బండిపై వచ్చి స్టాల్స్‌ను పరిశీలిస్తుండగా, ఆవు బెదిరి పరుగులు పెట్టింది. అక్కడ ఉన్న రైతులు, అధికారులు ఆందోళనకు గురయ్యారు. ఆవును అదుపులోకి తెచ్చేందుకు అక్కడ ఉన్న వారు నానా తంటాలు పడ్డారు. అదుపు చేసే క్రమంలో ఓ యువకుడిని తన్నడంతో గాయాలయ్యాయి. చివరకు ఆవును బయటకు తీసుకెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

దీపం నుంచి మంటలు

సభ వేదిక ప్రారంభ సమయంలో మంత్రులు జ్యోతి ప్రజ్వలన చేశారు. కొద్ది సేపటికి పొగ వస్తుండటంతో అక్కడే ఉన్న ఓ అటెండర్ బాటిల్‌లో నీళ్లు తెచ్చి చల్లార్చేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో దీపం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే దీపాన్ని అక్కడి నుంచి తొలగించారు.



ఆవును కట్టడి చేస్తున్న స్థానికులు, పక్కనే గాయపడి కూర్చున్న యువకుడు

నారు మిషన్లు ఎంతో ఉపయోగం

ఒక ఎకరానికి నారు వేయాలంటే మిషన్లతో తక్కువ సమయంలో వేయవచ్చు. ఎకరానికి కూలీలు నాటు వేస్తే రూ.6 వేలు ఖర్చు అవుతుంది. నారు మిషన్‌కు ఇద్దరు కూలీలు అవసరం ఉంటుంది. నాటు వేయడానికి 2 లీటర్ల పెట్రోల్‌తో రూ.200 ఖర్చు అవుతుంది. సులభంగా కలుపు తీయవచ్చు. వరుస క్రమంలో ఉండటం వల్ల వరి కోసే సమయంలో వర్షం పడితే త్వరగా ఆరుతుంది. సూర్యరశ్మి బాగా సోకి దోమ ఉధృతి తగ్గుతుంది.

విద్యుత్ ఆదాకు సోలార్ పంపుసెట్లు

వ్యవసాయ రంగంలో సోలార్ పంప్ (విండ్ జర్న్) సెట్ ద్వారా విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చు. దీని ధర రూ.1.50 లక్షలు ఉంటుంది. అధిక నీటిపారుదల పంటలకు హాని కలుగుతుంది. స్మార్ట్ కంట్రోల్ ప్యానల్‌ను అమర్చుకోవడం వల్ల మొబైల్ యాప్ ద్వారా పంపులను ఎక్కడి నుంచైనా ఆన్ లేదా ఆఫ్ చేసుకోవచ్చు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు. ఈ పంట మధ్యలో అరటి, కూరగాయలు, బొప్పాయి, పసుపు, మిర్చి తదితర అంతర పంటలు సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందవచ్చు. పామాయిల్ తోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీ కల్పిస్తుంది.



సోలార్ పంప్ సెట్ల పని తీరును వివరిస్తున్న విద్యుత్ అధికారులు

విదేశీ గో జాతి పశువులు

కిసాన్ మేళాలో విదేశీ గో జాతి పశువులను ప్రదర్శనలో పెట్టారు. రైతులు ఈ పశువులను చూసేందుకు ఆసక్తి కనబర్చారు. హోలిస్టిన్ ఫ్రిజియన్ రకం ఆవులు అధిక పాల దిగుబడిని ఇస్తాయి. ఈ ఆవులు ధర ఒక్కొంటికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంటుంది. రోజుకు పది లీటర్ల పాలు ఇస్తాయి. ఈ ఆవులు నలుపు, తెలుపు రంగులో ఉంటాయి.

ఎంతో నేర్చుకున్న



హుస్నాబాద్ పట్టణంలో మొదటి సారిగా కిసాన్ మేళా ఏర్పాటు చేయడం సంతోషం. వ్యవసాయానికి సంబంధించిన స్టాల్స్‌ను సందర్శించా. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారు. వివిధ కంపెనీలకు సంబంధించిన విత్తనాలు ప్రదర్శించారు. ఏ భూమిలో ఏ విత్తనం వేస్తే అధిక దిగుబడి వస్తుందో కంపెనీ ప్రతినిధులు వివరించారు.

– దోని అనిల్, రైతు, బిజ్జంకి

రైతులకు ఉపయోగం



మేళాలో వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు, వాటి పని తీరును తెలుసుకున్నాం. కలుపు తీసే యంత్రాలు, నాట్లు వేసే మిషన్లు వాడటంపై అవగాహన కల్పించారు. కూలీల రేట్లతో పోల్చుకుంటే యంత్రాల ఖర్చు తక్కువ, సమయం తగ్గుతుంది. పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీపై అందించాలి. ఆధునిక పనిముట్లతో వ్యవసాయం సులభంగా ఉంటుంది.

– పీసు మల్లారెడ్డి, రైతు, పీచుపల్లి

సాగు.. దిగుబడులపై అవగాహన



వ్యవసాయ సాగుతో అధిక దిగుబడి ఎలా పొందాలో శాస్త్రవేత్తలు వివరించారు. నాటి, నేటి వ్యవసాయానికి ఎంతో తేడా ఉంది. మాకు తెలువని వ్యవసాయ పద్ధతులు తెలుసుకున్నాం. ఏ కాలంలో ఏ పంట వేసుకోవాలి? ఏ భూమిలో ఏ పంట వేస్తే దిగుబడి వస్తుందో అవగాహన కల్పించారు. ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల పంట దిగుబడి తగ్గుతుంది. పంటల మార్పిడి చేసుకుంటే మంచిది. సేంద్రీయ వ్యవసాయంతోనే రైతులు ఆర్థికంగా పుంజుకుంటారు.

– బోడ సక్రూ, రైతు, పుల్‌నాయక్ తండా

పిస్తాహౌస్ హోటల్‌లో అగ్నిప్రమాదం



పిస్తాహౌస్ హోటల్ నుంచి వస్తున్న పొగ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జాతీయ రహదారిపై ఉన్న పిస్తాహౌస్ హోటల్‌లో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్ స్టేషన్ అధికారి నాగేంద్ర కథనం ప్రకారం.. పట్టణంలోని జ్యోతినగర్ కాలనీలో ఉన్న పిస్తా హౌస్ హోటల్ మూడవ అంతస్తులో ఉన్న వంటగదిలో సాయంత్రం 4గంటల సమయంలో చిమ్నిలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలంటుకున్నాయి. వెంటనే పటాన్‌చెరు, బెల్ సీఐఎస్‌ఎఫ్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. ప్రమాద సమయంలో టెర్రస్‌పై ఉన్న ముగ్గురు సిబ్బందిని స్మోక్ మాస్క్ అందించి వారిని రక్షించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటనా స్థలాన్ని రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సురేష్ సందర్శించారు.

ప్రాణాలు తీసుకొని.. ఆవేదన మిగిల్చి

దుబ్బాకటౌన్: ఓ వైపు గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ ఉద్యోగం పోవడం, మరో పక్క అనారోగ్య సమస్యలతో తీవ్ర మనస్తాపం చెందిన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం అనాజీపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మన్నె గోపయ్య (70) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. అలాగే గత ప్రభుత్వం వీఆర్ఏ ఉద్యోగాలను తొలగించడంతో తరచూ బాధపడుతుండేవాడు. ఈ రెండు సమస్యలతో విరక్తి చెందిన గోపయ్య ఈ నెల 4న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. శుక్రవారం గ్రామంలోని చెరువు సమీపంలో గోపయ్య చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి...



మధు(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వెల్దుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జువ్వ మధు(62) కొంతకాలంగా బీపీ, షుగర్‌లతో పాటు అధిక బరువుతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మానసిక వేదనతో జీవితంపై విరక్తి చెంది గురువారం గుర్తుతెలియని పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా, శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

రాయికోడ్(అందోల్): మండలంలోని నాగ్వార్ గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ నారాయణ కథనం మేరకు... గ్రామానికి చెందిన బి.విజయ్‌కుమార్ గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి ఆచూకీ కోసం గ్రామంలో, బంధువుల వద్ద కుటుంబసభ్యులు ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోర్టు ఆవరణలో బైక్ దొంగతనం

సంగారెడ్డి క్రైమ్: జిల్లా కోర్టు ఆవరణలో బైక్ దొంగిలించిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ కథనం ప్రకారం... పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన మంతూర్ వెంకటేశం జిల్లా కోర్టులో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 4న ఉదయం కోర్టు ఆవరణలో హీరోహోండా డీలక్స్ బైక్‌ను పార్కింగ్ చేసి విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గేదెను ఢీకొట్టి వ్యక్తి మృతి

దుబ్బాకరూరల్: గేదెను ఢీకొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం... మోతె గ్రామానికి చెందిన శ్రీనివాస్(55) తల్లి రాజవ్వతో కలిసి ద్విచక్రవాహనంపై హబ్సిపూర్ నుంచి గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గేదె అడ్డుగా రావడంతో దానిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజవ్వకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

అతివేగమే ప్రాణాలు తీసింది

- ఆటోను ఢీకొన్న లారీ..
- ఇద్దరు అక్కడికక్కడే మృతి



ఆటోలో ఇరుక్కొని మృతి చెందిన అభిషేక్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అతివేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. లారీ ఆటోను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని కంభాలపల్లి శివారులో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ మహేష్ గౌడ్ వివరాల మేరకు.. కొండాపూర్ మండలంలోని సైదాపూర్ తండాకు చెందిన సాయికిరణ్(23) పెద్దమ్మ సునీత బాయి, ఆమె కొడుకు అభిషేక్(13)తో కలిసి సదాశివపేట మండలంలోని నందికంది గ్రామానికి ఆటోలో వెళ్లి వ్యాపారం చేసేందుకు మామిడిపండ్లు కొనుగోలు చేశారు. అనంతరం పట్టణంలో సునీత బాయిని దింపి, స్వగ్రామానికి తిరిగి ఆటోలో సాయికిరణ్, అభిషేక్ బయల్దేరారు. మార్గమధ్యంలో కంభాలపల్లి శివారులో మోమిన్ పేట్ వైపు నుంచి సదాశివపేట వైపునకు అతివేగంగా వస్తున్న లారీ వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు సాయికిరణ్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తుండగా, అభిషేక్ ఆరో తరగతి చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసు లు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

రాయికోడ్(అందోల్): మండలంలోని శంశోద్దీన్‌పూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ నారాయణ కథనం మేరకు... జహీరాబాద్ పట్టణానికి చెందిన సీహెచ్.రమేష్ న్యాల్‌కల్ మండల కేంద్రం నుంచి రాయికోడ్ మండలంలోని నాగ్వార్ గ్రామానికి బంధువు వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. శంశోద్దీన్‌పూర్ గ్రామ శివారుకు చేరుకోగానే ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు రమేష్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడు..

మనోహరాబాద్(తూప్రాన్): కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి పట్టాలు దాటుతూ గుర్తు తెలియని రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు.ఈ ఘటన మనోహరాబాద్ మండలం పాలాట వద్ద చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే పోలీసుల వివరాల ప్రకారం... శివ్వంపేట్ మండలం గోమారానికి చెందిన సముద్రాల కృష్ణ (15) తన మేనమామతో కలిసి గురువారం శికారుకు వెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున కృష్ణ కాలకృత్యాలు తీర్చుకోవడానికి రైలు పట్టాలు దాటే క్రమంలో గుర్తు తెలియని రైలును ఢీకొట్టింది. దీంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హనుమాండ్లు తెలిపారు.

సూపర్ నేపియర్.. పోషకాలు మెండు

జిల్లాలో 4200 ఎకరాల్లో సాగు

- ఎకరాకు సుమారు 200 టన్నుల వరకు దిగుబడి
- వేగంగా ఎదగడంతో పాడి రైతులకు మేలు
- పెరుగుతున్న పాల ఉత్పత్తి



చిలప్‌చెడ్‌లో సాగవుతున్న సూపర్ నేపియర్ గడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గతంలో పశువుల మేత విషయంలో ఇబ్బందులకు గురైన పాడి రైతులు, సులభంగా, వేగంగా పెరిగే సూపర్ నేపియర్ గడ్డి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అధిక పోషకాలు, విటమిన్లు ఉండటంతో ఈ గడ్డిని రైతులు సాగు చేస్తున్నారు. ఈ రకమైన పచ్చి మేతతో పశువులు, జీవాల ఆరోగ్యంతో పాటు, ఉత్పత్తి, పాల దిగుబడి పెరుగుతోంది. ప్రస్తుతం మెదక్ జిల్లాలో సూపర్ నేపియర్ గడ్డి సుమారు 4200 ఎకరాల్లో సాగవుతోంది. ఈ గడ్డిని ఒకసారి నాటితే సుమారు ఎనిమిదేళ్ల వరకు, ఎకరానికి ఎనిమిది కటింగ్‌ల వరకు వస్తుంది. ఎకరాకు సుమారు 200 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. 20 గేదెలకు, 35 జీవాలకు సంవత్సరం పాటు సరిపోతుందని పాడి రైతులు పేర్కొంటున్నారు.

నాటుకునే పద్ధతులు

సూపర్ నేపియర్ గడ్డిని నేరుగా విత్తనాలు తీసుకొచ్చి విత్తుకోవచ్చు. కాగా జిల్లాలోని రైతులు కాండం గడలు నాటుకుంటున్నారు. ఎకరాకు సుమారుగా 10 వేల వరకు గడలు అవసరమవుతాయి. చదునైన నేలలో నాటుకోవాలి. ఎలాంటి వాతావరణంలోనైనా, ఎలాంటి నేలలోనైనా సూపర్ నేపియర్ సులువుగా, వేగంగా పెరుగుతుంది. పైగా ఈ గడ్డి సాగుకు చీడపీడల సమస్య ఉండదు. రెండు సార్లు కలుపు తీసుకుంటే సరిపోతుంది. మొదటిసారి కోత 80 నుంచి 90 రోజుల్లో వస్తుంది. సుమారు 8 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. తర్వాత వచ్చే కోతలు 35 నుంచి 40 రోజుల్లో వస్తాయి. సుమారుగా ఏడాదిలో ఎనిమిది సార్లు గడ్డి కోతకు వస్తుంది.

పశువులు ఇష్టంగా తింటాయి

సూపర్ నేపియర్‌ను ఇతర గడ్డి రకాలతో పోలిస్తే వేగంగా పెరుగుతుంది. పైగా వాటికంటే ఎక్కువగా దిగుబడి ఇస్తుంది. తక్కువ స్థలంలో, తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి ఇస్తుంది. ఈ రకం గడ్డి పెరిగే నేలలను బట్టి 14 నుంచి 18 శాతం వరకు పోషకాలు కలిగి ఉంటుంది. గడ్డి కాండం తియ్యదనంతోపాటు ఆకులు పొడవుగా, లేతగా ఉండటంతో పశువులు ఇష్టంగా తింటాయి. ఈ గడ్డి అన్ని రకాల పశువులు, జీవాలకు, కోళ్లకు సైతం ఆహారంగా ఇవ్వవచ్చు.



శీలాంపల్లిలో చాప్‌కట్టర్‌తో గడ్డిని కట్ చేస్తున్న రైతు

మంచి లాభాలు



గతంలో చాలా గడ్డి రకాలు పండించా. సూపర్ నేపియర్ చాలా సులభమైన రకం. ఈ రకం గడ్డిని పశువులు ఇష్టంగా మేస్తాయి. గతంలో ఈ రకం గడ్డి సాగు చేస్తే ప్రభుత్వం బోనస్‌లు సైతం ఇచ్చేది. ప్రస్తుతం ఏమి రావడం లేదు. చాప్‌కట్టర్ సైతం సబ్సిడీలోనే తీసుకున్నా. ప్రస్తుతం ఎలాంటి సబ్సిడీలు లేవు. సూపర్ నేపియర్‌తో పాటు, 4జీ బుల్లెట్ రకం గడ్డిని సైతం సాగు చేస్తున్నా. ప్రస్తుతం పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు, పాల దిగుబడి బాగుంది.

– నవీన్‌రెడ్డి, పాడి రైతు, శీలాంపల్లి

పాడి రైతులను ప్రోత్సహిస్తున్నాం



జిల్లాలో సూపర్ నేపియర్ గడ్డిని సాగు చేస్తున్నప్పటికీ, ఇంకా ఎక్కువ మొత్తంలో సాగు చేసేలా పాడి రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఈ రకమైన గడ్డితో రైతులు, పశువులకు ఎన్నో లాభాలు ఉన్నాయి. ఈ రకమైన మేతతో పశువుల్లో మెరుగైన ఆరోగ్యంతో పాటు పాల ఉత్పత్తి పెరుగుతుంది. త్వరలోనే చాప్‌కట్టర్‌లు సబ్సిడీలో వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– వెంకటయ్య, పశువైద్యాధికారి, మెదక్ జిల్లా

జాతీయస్థాయి ఇన్నోవేషన్‌కు ఎంపికైన విత్తనశుద్ధి యంత్రం

– రూపొందించిన మిర్జాపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు



చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు రూపొందించిన విత్తనశుద్ధి యంత్రం జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మారథాన్ 2021–25కు ఎంపికైనట్లు ఎంఈఓ పుష్పవేణి తెలిపారు. టాప్–1000 టీమ్‌లో జిల్లా నుంచి విద్యార్థులు రూపొందించిన విత్తన శుద్ధి యంత్రం ఎంపికైందని పేర్కొన్నారు. యంత్రాన్ని రూపొందించిన 9వ తరగతి విద్యార్థులు నివాస్‌రాయుడు, ప్రశాంత్, వినయ్‌కుమార్, గైడ్ టీచర్ రాజేష్‌ను ఎంఈఓ అభినందించారు.

కేసు ఛేదించిన పోలీసులకు రివార్డు

న్యాల్‌కల్(జహీరాబాద్): హత్య కేసును ఛేదించిన పోలీసులకు ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం రూ.10వేలు రివార్డు అందజేశారు. మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన రాణెమ్మ హత్య కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు రెండు, మూడు రోజుల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. కేసును ఛేదించిన జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంత్, హద్నూర్ ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది ఓందేవ్, అస్లాం, ఆనంద్, హరినేత్ర, రవికుమార్, రాజశేఖర్, సుభాష్‌కు ఎస్పీ నగదు అందజేసి అభినందించారు.